హామీలు ఏమాయే ?

- గృహజ్యోతికి దరఖాస్తు చేసుకున్నా రాని జీరో బిల్లు
- 'ప్రజాపాలన'ను తిరిగి ప్రారంభించాలని ప్రజల డిమాండ్



రామంతాపూర్ వార్డు కార్యాలయం వద్ద బారులు తీరిన ప్రజలు

రామంతాపూర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీ పథకాలు కొద్ది మందికే లబ్ధి చేకూరుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ తదితర పథకాలు ఉప్పల్ సర్కిల్‌లోని హబ్సిగూడ, రామంతాపూర్, చిలుకానగర్ డివిజన్ల ప్రజలు దరఖాస్తు చేసుకున్నా.. కొంతమందికే జీరో కరెంట్ బిల్లులు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులనే అధికారులు ప్రామాణికంగా తీసుకుని సరిగ్గా ఉన్న వాటికే 200 యూనిట్ల విద్యుత్ వాడకంలో జీరో బిల్లులు అందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తప్పుగా నమోదు..

గృహ జ్యోతి పథకానికి తాము అన్ని విధాలా అర్హులైన ప్రజాపాలనలో తాము ఇచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ నమోదు చేసేటప్పుడు ఆపరేటర్లు దరఖాస్తుల వివరాలను తప్పుగా నమోదు చేయడంతో తాము ఈ పథకానికి లబ్ధి పొందలేకపోతున్నామని పలువురు వాపోయారు.

సరిదిద్దేందుకు కౌంటర్ల ఏర్పాటు..

ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాల కోసం ప్రజలు అందజేసిన దరఖాస్తు ఫారాల్లో ఉన్న తప్పులను సవరించేందుకు ఉప్పల్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ అధికారులు రామంతాపూర్, ఉప్పల్, హబ్సిగూడ, చిలుకానగర్‌లోని వార్డు కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తప్పులను సరిదిద్దే పనులను చేపట్టేందుకు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్లలో ప్రజలు బారులు తీరి తమ దరఖాస్తు ఫారాలను తనిఖీ చేయించుకుంటున్నారు. తాము దరఖాస్తు చేసుకున్న రశీదులను సైతం తీసుకొచ్చి ఫిర్యాదు చేస్తున్నామని ప్రజలు చెబుతున్నారు. దీంతో అధికారులు ఈ రశీదులను వారి రేషన్‌కార్డులను పరిశీలించి సిస్టంలో మీ పేరు మీద ఆప్షన్ లేదని తిప్పి పంపిస్తున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రజాపాలన ప్రక్రియను ప్రారంభించాలి..



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకున్న చాలా మందికి నిరాశే ఎదురౌతోంది. అసలు దరఖాస్తు చేసుకోలేదన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. వెంటనే ప్రజాపాలన కార్యక్రమాన్ని పునఃప్రారంభించి తిరిగి దరఖాస్తు చేసుకునేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలి.

– నరసింహ, ఓల్డ్ రామంతాపూర్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



కౌకూర్‌లో స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ జితేంద్రనాథ్

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్‌లోని అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. రెసిడెంట్స్ సంక్షేమ సంఘం సభ్యుల అభ్యర్థన మేరకు మంగళవారం మచ్చబొల్లారం డివిజన్‌లోని కౌకూర్‌లో ఆయన పలు కాలనీలలో పాదయాత్ర నిర్వహించారు. ఇటీవల నూతన కాలనీలలో డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్యలపై నివాసితులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన సరైన ప్రతిపాదనలు రూపొందించి నిధుల మంజూరుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సురేందర్‌రెడ్డి, శ్రీశైలం, మల్లికార్జున్, శ్రీనివాస్, కవిత, సంజీవ, శివరాజ్, గౌతమ్, శకుంతల, రూపేందర్‌రెడ్డి, సాయి, విష్ణు, ఆంజనేయులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్



నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని నాచారం ఓల్డ్ విలేజ్‌లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డ్రైనేజీ పనులు చివరి దశకు చేరాయన్నారు. కేవలం ఓ వీధిలో లెవల్ కలవకపోవడంతో సమస్య వచ్చిందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కొత్త పైపులైన్ పనులను ప్రారంభించామన్నారు. పనులు పూర్తైతే సీసీరోడ్డు పనులను చేపట్టాలని అధికారులకు సూచించారు. జలమండలి మేనేజర్ వేణుగోపాల్, బీఆర్ఎస్ నేతలు ముత్యంరెడ్డి, విఠల్‌యాదవ్, బుచ్చన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారం..

మౌలాలి : సింహాద్రినగర్‌లో డ్రైనేజీ సమస్య ఉందని కాలనీవాసులు కార్పొరేటర్ రాజ్యలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా.. ఆమె హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ మేనేజర్ నవీన్, సూపర్‌వైజర్ నాగార్జునతో కలిసి వెళ్లి డ్రైనేజీ సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి 'సాక్షి ఫోన్ ఇన్'

రేపు అల్వాల్ సర్కిల్ డీసీతో..

అల్వాల్: జీహెచ్‌ఎంసీ అల్వాల్ సర్కిల్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి 'సాక్షి' దినపత్రిక చొరవ తీసుకుంటుంది. దీనికోసం అల్వాల్ సర్కిల్ ఉపకమిషనర్ శ్రీనివాస్ రెడ్డితో ఫోన్ ఇన్ కార్యక్రమం చేపట్టింది. సర్కిల్ పరిధిలోని అల్వాల్, వెంకటాపురం, మచ్చబొల్లారం డివిజన్‌లలో సమస్యలను నేరుగా ఉపకమిషనర్ దృష్టికి తీసుకురావచ్చు. ఈ నెల 25న ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు నేరుగా ఫోన్‌చేసి తమ కాలనీలోని సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకురావచ్చు. సంప్రదించాల్సిన నంబర్లు 8985409173, 9553955674.

పవర్‌బోర్‌కు మరమ్మతులు చేయించాలని వినతి



కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్‌లోని బస్తీ దవాఖాన వద్ద ఉన్న బోరు చెడిపోయింది, మరమ్మతులు చేయాలని కోరుతూ మంగళవారం వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డికి అశోక్‌నగర్ కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. జలమండలి అధికారులతో మాట్లాడి తాగునీటి పైపులైన్ కూడా ఏర్పాటు చేయిస్తానని వారికి హామీ ఇచ్చారు. మొసలి శ్రీనివాస్ రెడ్డి, బుసాని రఘు, విక్టరీ జోష్, శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సర్టిఫికెట్ల అందజేత



ఒరిజినల్ సర్టిఫికెట్లను విద్యార్థినికి అందజేస్తున్న దృశ్యం

కుషాయిగూడ: అనారోగ్యం కారణంగా బీ–ఫార్మసీ కోర్సును మధ్యలోనే వదిలేసిన సంఘవి అనే విద్యార్థినికి ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్న కళాశాల యాజమాన్యం నుంచి హైకోర్టు న్యాయవాది సుంకర నరేష్ మంగళవారం ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇప్పించారు. వివరాలకు వెళ్లితే.. దమ్మాయిగూడకు చెందిన సంఘవిగౌడ్ 2016లో ఓ కళాశాలలో బీ –ఫార్మసీ కోర్సులో చేరింది. మొదటి సెమిస్టర్ పరీక్షలు రాసిన తరువాత అనారోగ్య కారణాలతో చదువు మధ్యలోనే ఆపేసింది. అప్పటి నుంచి ఆమెకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు వెనక్కి తిరిగి ఇవ్వమని సదరు కాలేజీ యాజమాన్యాన్ని కోరారు. ప్రభుత్వం నుంచి వారికి రావాల్సిన ఫీజు, రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదనే సాకుతో సర్టిఫికెట్లు ఇవ్వలేదు. దీంతో హైకోర్టు న్యాయవాదిని ఆమె ఆశ్రయించింది. ఈ విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడి హైకోర్టులో ఆయన కేసు వేశారు. దీంతో సదరు కాలేజీ యాజమాన్యం దిగొచ్చి విద్యార్థినికి మంగళవారం ఒరిజినల్ సర్టిఫికెట్లను అందజేశారు.

నేడు మల్లాపూర్‌లో రక్తదాన శిబిరం

మల్లాపూర్: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన సందర్భంగా మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌండిన్య భవన్‌లో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. నేడు ఉదయం 8.30 గంటలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు.

మల్కాజిగిరి పీఎస్‌కు నూతన ఎస్సైలు

మల్కాజిగిరి: మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో నలుగురు నూతన ఎస్సైలు బాధ్యతలు స్వీకరించారు. సెక్టార్ –3 (మౌలాలి)ఎస్సై మల్లయ్య ఎల్‌బీనగర్ పీఎస్‌కు బదిలీకాగా.. ఆయన స్థానంలో గణేష్‌బాబు, సెక్టార్ 4 (మల్కాజిగిరి)ఎస్సై కృష్ణమల్ చౌటుప్పల్‌కు, ఆయన స్థానంలో శంకర్, సెక్టార్ 5 (ఈస్ట్ ఆనంద్‌బాగ్) ఎస్సై సతీష్ ఎల్‌బీనగర్ పీఎస్‌కు బదిలీకాగా.. నూతన్ ఎస్సైగా ఉపేందర్, సెక్టార్ 6 (గౌతంనగర్)ఎస్సై లక్ష్మయ్య జవహర్‌నగర్ పీఎస్‌కు, ఆయన స్థానంలో సునీల్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు.



మిర్జాల్‌గూడలో గుంతలమయంగా మారిన రోడ్డు ఇలా..

గుంతల్.. చింతల్

గౌతంనగర్ : గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మిర్జాల్‌గూడలోని రోడ్డు గుంతలమయంగా మారింది. గత కొంతకాలంగా గతుకుల రోడ్డుపై ప్రతిరోజూ రాకపోకలు సాగించాలంటే నరకం అనుభవిస్తున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షపునీరు గుంతల్లో చేరి రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రజలు చెబుతున్నారు.

నిధులు మంజూరైనా ప్రారంభించని రోడ్డు పనులు...

డివిజన్ పరిధిలోని మిర్జాల్‌గూడ తదితర ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీని ఆధునీకరించడానికి పాత పైపులను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేసేందుకు రోడ్లను తవ్వి వదిలేశారు. ఇప్పటి వరకు సంబంధిత అధికారులు రోడ్లు వేయలేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరై ఏడాది గడిచినా.. పనులు ప్రారంభించలేదని వాపోయారు. గతంలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం కోసం తవ్వకాలు జరిపినప్పుడు రాత్రిపూట ఓ వ్యక్తి తవ్వి వదిలేసిన గుంతలో పడి మృతి చెందాడని కాలనీవాసులు చెబుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలని కోరుతున్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి



సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ మల్కాజిగిరి కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. చనిపోయిన కార్మికుల కుటుంబసభ్యుల్లో ఒకరికి వెంటనే ఉద్యోగం కల్పించాలన్నారు. అధికారులు కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్నారని, పనిభారం పెంచుతూ.. వారాంతపు సెలవు ఇవ్వడం లేదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సమాచారం అందించినా వారికి వేతనంలో కోత విధించడం సరికాదన్నారు. పీఎఫ్ ఖాతాకు జీహెచ్‌ఎంసీ నుంచి డబ్బులు జమచేయడం లేదన్నారు. పలు సమస్యలను కార్మికులు ఎదుర్కొంటున్నారని పరిష్కరించడంలో చొరవ చూపకపోతే తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. జిల్లా కోశాధికారి ఉన్ని కృష్ణ, మండల కార్యదర్శి నర్సింగరావు, మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు నాగరాజు, బాబూరావు, ఎల్లయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ఎల్‌ఓసీలను అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్ : మల్కాజిగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి ద్వారా వైద్య ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు. నేరేడ్‌మెట్ డివిజన్‌కు చెందిన జనార్ధన్‌రావుకు రూ.1,10,000, అల్వాల్ డివిజన్‌కు చెందిన గోవిందరాజుకు, అల్వాల్‌కు చెందిన భాగ్యలక్ష్మి, వెంకటాపురం, మచ్చబొల్లారంకు చెందిన వెంకటేష్‌లకు రూ.1,75000ల చొప్పున చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి, రమేష్, ఉష, సంతోష్‌గుప్తా, శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ వేడుకలు

మల్కాజిగిరి: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) 70 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆర్‌కేనగర్ ఆటోస్టాండ్ వద్ద ఘనంగా నిర్వహించారు. మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ బీఎంఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలపై బీఎంఎస్ అలుపెరగని పోరాటం కొనసాగిస్తూ.. వారికి అండగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలన్నారు. బీపీటీఎంఎం జాతీయ కార్యదర్శి రవిశంకర్, స్థానిక నేతలు రంగారావు, నర్సింహ, ఐలయ్య, సిద్ధు, ఆనంద్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రవణ్



ఫలహారం బండి ఊరేగింపు

కాప్రా: బోనాల ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే ఫలహారం బండి ఊరేగింపు కాప్రా గాంధీనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఆషాఢమాసంలో అమ్మవార్లకు బోనాలు సమర్పించిన అనంతరం (పలారం) ఫలహారం బండి, తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ స్వర్ణరాజ్, స్థానికులు సత్యనారాయణ, పవన్‌కుమార్, విఠల్‌నాయక్, మల్లారెడ్డి, నరేందర్‌గౌడ్, రాకేష్‌యాదవ్, సంతోష్‌చారి, పూర్ణయాదవ్ పాల్గొన్నారు.

కార్పొరేటర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ కార్పొరేటర్ బీసీ కులానికి చెందిన వారు కాదని బీఆర్ఎస్ పార్టీ పీర్జాదిగూడకు చెందిన ప్రతినిధులు మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్, బీసీ కమీషన్, రాష్ట్ర ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేశారు. మహారాజుల వంశమని పిలువబడే క్షత్రియ, రాజ్‌పుత్ వంశానికి చెందిన కార్పొరేటర్ 2020లో తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీచేసి గెలిచారని ఆరోపించారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పెర్కొన్నట్లు వివరించారు. పీర్జాదిగూడ కార్పొరేషన్ బీఆర్ఎస్ ప్రతినిధులు రఘువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



కాప్రా: జమ్మిగడ్డ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కాప్రా డివిజన్ గాంధీనగర్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరం ద్వారా స్థానికులు బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ రమాదేవి సూచించారు. డాక్టర్ ప్రసన్నకుమారి, వైద్య సిబ్బంది ఉష, శ్యామ్‌సుందర్, రాణి, ప్రమీల, ప్రసన్న, రాధిక, సుధ, స్థానికులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

బోడుప్పల్: బోడుప్పల్‌లోని డబుల్ బెడ్రూమ్ వరకు బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఉప్పల్ డిపో మేనేజర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. 18/బి, 113, 115 బస్సులను ఇక్కడ వరకు నడపాలని కోరారు. పేద, మధ్యతరగతి ప్రజలు నివసిస్తున్నారని, బస్సు సౌకర్యం కల్పిస్తే వారికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రూట్‌ను పరిశీలించి పరిష్కారం చూపుతామని డిపో మేనేజర్ హామీ ఇచ్చినట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ నేతలు దానగల్ల యాదగిరి, డివిజన్ అధ్యక్షులు గోపురాం, కాలనీవాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి, అధికారులు

రామంతాపూర్ : ఉప్పల్ డివిజన్ పరిధిలోని శ్రీరమణపురం కాలనీలో కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ ఈఈ నాగేందర్, జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ రజనీకాంత్‌రెడ్డిలతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డివిజన్‌లో రాజకీయాలకు తావులేకుండా అన్ని కాలనీ, బస్తీల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు. శ్రీరమణపురంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి కొత్త పైపులైన్, వరదనీటి కాలువల నిర్మాణాలతో పాటు సీసీరోడ్ల నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. కాలనీ అధ్యక్షుడు రాములు, రాఘవేందర్, సాయిలు, లూకాస్, సత్తిరెడ్డి, సందీప్, సురేష్, సీతారామశర్మ, నరసింహారెడ్డి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మోహన్ (ఫైల్)

మేడిపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పి.మోహన్(26) నగరంలోని నాచారం ఇందిరానగర్‌లో నివసిస్తూ.. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం 9 గంటలకు తన ద్విచక్ర వాహనంపై మేడిపల్లి వైపు వెళ్తుండగా.. హైదరాబాద్ నుంచి వరంగల్ వెళ్తున్న హనుమకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మేడిపల్లి అనుటెక్స్ షాపింగ్‌మాల్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోహన్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

ఘట్‌కేసర్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని పలు విభాగాలను పరిశీలించిన అనంతరం వైద్యాధికారి డాక్టర్ కోట్యానాయక్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆస్పత్రి, ఉప్పల్ పీహెచ్‌సీలో ఎలీసా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఈఎన్‌టీ విభాగం ఓపీ సేవలు పెంచాలని ఆదేశించారు. ప్రసవం కోసం వచ్చే వారి వివరాలు, బర్త్ డోస్, టీకాలు, డయాలిసిస్ విభాగాన్ని పరిశీలించారు. బ్లడ్ బ్యాంక్‌లో రక్తం నిల్వలు, పురుషులు, మహిళలు వార్డులు సందర్శించి సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రతాపసింగారంలో పల్లె దవాఖానా, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి రఘునాథస్వామి, స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, జంగయ్య యాదవ్, కుమార్‌ముదిరాజ్, ప్రభాకర్‌రెడ్డి, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.